నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్‌ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌ శాఖ ఏడీఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ లంగర్‌హౌస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని మారుతీనగర్‌, ఓం నగర్‌, ఫతే దర్వాజ, చోటా బజార్‌, సెంట్రల్‌ బంగ్లా, మ్యూజియం, గోల్కొండ పోస్ట్‌ ఆఫీస్‌, సెవెన్త్‌ గల్లీ, బడా బజార్‌, ధాన్‌కోట, సాలెనగర్‌ కంచ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

సత్యనారాయణనగర్‌ కాలనీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌సింగ్‌



గోల్కొండ: గుడిమల్కాపూర్‌ డివిజన్‌ సత్యనారాయణనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎస్‌.విజయ్‌కుమార్‌సింగ్‌ ఎన్నికయ్యారు. ఈ పదవికి ఆయన వరుసగా రెండవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి అసోసియేషన్‌ సభ్యులతో పాటు స్థానికులతో కలిసి కృషి చేస్తానన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



బీజేపీ నాయకులతో అమర్‌సింగ్‌

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిందని బీజేపీ కార్వాన్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్‌ అన్నారు. గుడిమల్కాపూర్‌ డివిజన్‌ అధ్యక్షుడు సునీల్‌యాదవ్‌ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. బీజేపీ సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పని చేసిన నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్వర్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు సత్కారం



కేటీఆర్‌ను సత్కరిస్తున్న కోళ్ల ప్రదీప్‌రాజ్‌, టాంపు శర్మ

అఫ్జల్‌గంజ్‌: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ను బేగంబజార్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్‌, టాంపు శర్మ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేటీఆర్‌ మాట్లాడుతూ..ప్రజలకు కాంగ్రెస్‌ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు ప్రతి బీఆర్‌ఎస్‌ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా మహా పడిపూజ



పూజల్లో సంతోష్‌ పహిల్వాన్‌, ధన్‌రాజ్‌ తదితరులు

అఫ్జల్‌గంజ్‌: బేగంబజార్‌లో యాదవ సమాజ్‌కు చెందిన సంతోష్‌ పహిల్వాన్‌ ఆధ్వర్యంలో ఈ అయ్యప్ప మహా పడిపూజ సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రేటర్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు ఎస్‌.ధన్‌రాజ్‌, యోగేష్‌ యాదవ్‌, నిఖిల్‌, సతీష్‌ గౌడ్‌ గురుస్వామి, స్థానిక బస్తీల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అమ్మవారి వృత్తిపని వారికి గుర్తింపు



సాయిబాబాచారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: అందరి సహకారంతోనే అమ్మవారి వృత్తిపని వారికి గుర్తింపు లభించిందని అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. వృత్తిపని వారికి గుర్తింపు బోనాల గౌరవ భత్యం లభించేందుకు తీవ్రంగా కృషి చేసిన ఆయన జన్మదినం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు, మహంకాళి అమ్మవారి పూజారి బి.సురేష్‌చారి ఆయనను ఘనంగా సన్మానించారు.

ఆహ్వానం



నిరంజన్‌ను ఆహ్వానిస్తున్న లెనిన్‌బాబు

చాంద్రాయణగుట్ట: ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌లోని ప్రాచీనమైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని ఆలయ కమిటీ చైర్మన్‌ బాశెట్టి లెనిన్‌బాబు రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ జి.నిరంజన్‌ను ఆహ్వానించారు. ఆలయ సభ్యులు పి.వెంకటేశ్వర్‌ రావు, లెక్కల మురళీధర్‌ రావులతో ఆయనను సోమవారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

నాంపల్లి స్టేషన్‌ వద్ద నయా దందా

- అడ్డగోలుగా ప్రైవేట్‌ బస్సుల పార్కింగ్‌
- స్టేషన్‌ పునరాభివృద్ధి పనులకు అడ్డంకి
- ఒక్కో ప్రైవేట్‌ బస్సుకు రూ.500 చొప్పున వసూలు



రైల్వే స్టేషన్‌ వద్ద పార్కింగ్‌ చేసిన ప్రైవేట్‌ బస్సులు

నాంపల్లి: దీపం ఉండగానే ఇంటిని చక్కబెట్టుకోవాలనేది నానుడి. ఈ నానుడిని కొందరు రైల్వే అధికారులు తుచ పాటిస్తున్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌ ఎదుట ఉండే నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌ స్థలాన్ని వదలడం లేదు. ఈ స్థలంలో ప్రయాణికుల సౌకర్యార్థం కార్లను మాత్రమే పార్కింగ్‌ చేసుకునే అవకాశం ఉంది. కానీ ప్రైవేట్‌ బస్సులకు అనధికారిక అనుమతిని ఇచ్చేశారు. నాలుగు చక్రాల వాహనాలు నిలిపే కాంట్రాక్టును దక్కించుకున్న కాంట్రాక్టర్‌ తన కాంట్రాక్ట్‌ గడువు త్వరలోనే పూర్తి కాబోతోంది. దీనికి తోడు హైదరాబాద్‌ రైల్వే స్టేషన్‌ పునరాభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇందుకోసం రూ.309 కోట్లను రైల్వే శాఖ ఖర్చు చేస్తోంది. ఈ పునరాభివృద్ధి పనులు ఏడాదిలోగా పూర్తి కానున్నాయి. ఇదే అదునుగా భావించిన సదరు కాంట్రాక్టర్‌ పార్కింగ్‌ స్థలాన్ని అనధికారిక ప్రైవేట్‌ బస్టాండ్‌గా మార్చేశారు. ఇందుకు రైల్వే ఓ కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్ట్‌ గడువు ముగిసే సమయంలో ఇలాంటి అడ్డగోలు దోపిడీకి తెరలేపారు.

ప్లాట్‌ఫారాల పొడిగింపుతో..

రైల్వే స్టేషన్‌ పునరాభివృద్ధిలో ప్రస్తుతం ఉన్న నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌ కనుమరుగు కానుంది. ఇక్కడ అండర్‌గ్రౌండ్‌ వాహనాల పార్కింగ్‌ వస్తుంది. ప్లాట్‌ఫారాల పొడిగింపుతో ఓపెన్‌ పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోతోంది. ప్రస్తుతం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆరు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. ఒకటి, రెండు ప్లాట్‌ఫారాలు ప్రస్తుతం ఉన్న నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌ ప్రదేశంలో నిర్మితం అవుతాయి. వీటికి అనుగుణంగా పార్కింగ్‌ స్థలాలను ఏర్పాటు చేస్తారు. ఇలాంటి తరుణంలో కాంట్రాక్టర్‌ అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్‌ చేసేందుకు పూనుకున్నారు. ఇక్కడ ఒక్కో ప్రైవేట్‌ బస్సుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 ప్రైవేట్‌ బస్సులను పార్కింగ్‌ చేస్తున్నారు.

లక్డీకాపూల్‌ రైల్వే స్టేషన్‌లోనూ..

లక్డీకాపూల్‌ రైల్వే స్టేషన్‌లో అడ్డగోలుగా ప్రైవేట్‌ వాహనాలను పార్కింగ్‌ చేస్తున్నారు. హైదరాబాద్‌ నుంచి బెంగళూరు, ముంబై, చెన్నై, నాగ్‌పూర్‌లతో పాటుగా ఇతర జిల్లాలకు వెళ్లే ప్రైవేట్‌ బస్సులను ఇక్కడే (డే హాల్ట్‌) పార్కింగ్‌ చేస్తున్నారు. రైల్వే అధికారుల తీరుతోనే ప్రైవేట్‌ బస్సుల ఆగడాలు మితిమీరిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైల్వే స్టేషన్‌లోనికి వెళ్లడానికి కూడా చోటులేకుండా పోతోందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వేకు ఆదాయం వస్తుందనే కుంటిసాకును చూపి నిబంధనలకు విరుద్ధంగా నడిపే కాంట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చేశారు. ఇక్కడ అడ్డగోలుగా వాహనాల పార్కింగ్‌తో నయా దందా కొనసాగుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి కాంట్రాక్టులను నిషేధించి, రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రైవేట్‌ బస్సుల పార్కింగ్‌కు అనుమతి ఉంది..

ఈ విషయమై నాంపల్లి రైల్వే స్టేషన్‌ కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేష్‌ను వివరణ కోరగా ప్రైవేట్‌ బస్సులకు పార్కింగ్‌ చేసుకునేందుకు అనుమతి ఉందని తెలిపారు. ఈ అనుమతి తాను ఇవ్వలేదన్నారు. సికింద్రాబాద్‌ డివిజన్‌కు చెందిన ఉన్నతాధికారులే పార్కింగ్‌కు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఈ పార్కింగ్‌ కాంట్రాక్ట్‌ను ప్రతి ఏటా రెన్యువల్‌ చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

వాటర్‌బోర్డు సమస్యల పరిష్కారానికి కృషి



ఇడ్లీ గల్లీలో సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో వాటర్‌బోర్డు సమస్యలను ఎప్పటికప్పుడు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఇడ్లీ గల్లీలో నూతన పైప్‌లైన్‌ నిర్మాణ పనులు పూర్తయితే తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్‌, మనోహర్‌, నరేష్‌, బాచి, సురేష్‌ చారి, బాలాజీ, దయశంకర్‌ పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు



సురేందర్‌

యాకుత్‌పురా: రేషన్‌ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్‌ ఏసీఎస్‌ఓ మోక సురేందర్‌ అన్నారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ..తమ సర్కిల్‌ పరిధిలో మొత్తం 83 రేషన్‌ దుకాణాల్లో 90,848 రేషన్‌ కార్డులున్నాయన్నారు. ఇందులో అంత్యోదయ కార్డులు–4841, ఆహార భద్రత కార్డులు–85,998, అన్నపూర్ణ కార్డులు–11 ఉన్నాయన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ వరకు రేషన్‌ బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. సర్కిల్‌ పరిధిలో ఈ నెల 5న సుల్తాన్‌ షాహి, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న 15 కింటళ్ల రేషన్‌ బియ్యాని స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

11న కేశవ స్వామి మహారాజ్‌ జయంతి



కేశవ స్వామి మహారాజ్‌ జీవ సమాధి

జియాగూడ: కేశవస్వామినగర్‌ని కేశవస్వామి మహారాజ్‌ జయంతిని ఈ నెల 11న వైభవంగా నిర్వహిస్తామని మఠాధిపతి దండే మహారాజ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, కేశవ స్వామి మహారాజ్‌ రచించిన గేయాలను భజనల రూపంలో ఆలపించడం జరుగుతుంది. 12 గంటలకు అఖండ హారతి ఇవ్వడంతో పాటు మహా అన్నదాన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు.

శుభాకాంక్షలు



వీర సోమేశ్వర స్వామి నుంచి మెమెంటో అందుకుంటున్న నాగనాథ్‌ మాశెట్టి

చార్మినార్‌: కర్ణాటక రంభపురి ప్రాంతానికి చెందిన 1008 జగద్గురు డాక్టర్‌ వీర సోమేశ్వర స్వామిని టీఎస్‌ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్‌ నాగనాథ్‌ మాశెట్టి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీర సోమేశ్వర స్వామిని దర్శించుకుని ఆయన ఆశీర్వాదం పొందామన్నారు. ఈ సందర్భంగా ఆయన నాగనాథ్‌ మాశెట్టికి మెమెంటో అందజేశారు. ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని కోరుకున్నట్లు నాగనాథ్‌ మాశెట్టి తెలిపారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం



కేంద్ర మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అజయ్‌ స్వామి

చార్మినార్‌: చార్మినార్‌ చౌక్‌ మైదాన్‌ ఖాన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగబోయే వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొనాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరినట్లు బాలాజీ ఆలయ ప్రతినిధి సేనాపతి అజయ్‌ స్వామి తెలిపారు. సోమవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి



ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న చంద్రమోహన్‌గౌడ్‌

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మద్యం దుకాణాల వద్ద ఇష్టానుసారంగా చేస్తున్న వాహనాల పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ హైదరాబాద్‌ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్‌ గౌడ్‌ కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులతో ఇన్‌స్పెక్టర్‌ కె.నాగేంద్ర ప్రసాద్‌వర్మను కలిసి సమస్యను విన్నవించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు ఆయనను సన్మానించారు. పాత పోలీస్‌స్టేషన్‌ కూడా అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారిందని, గౌలిపురా మార్కెట్‌ ప్రాంతంలోని అవుట్‌ పోస్ట్‌ను కూడా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చి, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అటుకుల రాజు, సునీల్‌ కుమార్‌, శ్రీనివాస్‌ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి అర్చన



చాంద్రాయణగుట్ట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రక్షాపురం శివాలయంలో సోమవారం లక్ష తులసి అర్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ, పూజారీ శుక్లా ల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ అర్చనలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోదా, రంగనాయక స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాస్‌, ఇన్‌చార్జి పార్థసారథి తగు చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ పోమ్యనాయక్‌ తదితరులు

యాకుత్‌పురా: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రోగ్రెసివ్‌ రికగ్నైజ్డ్‌ టీచర్స్‌ యూనియన్‌ (పీఆర్‌టీయూ) హైదరాబాద్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకట్‌ రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను సోమవారం బహదూర్‌పురా మండల కార్యాలయంలో డిప్యూటీ ఈఓ పోమ్యానాయక్‌ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, బహదూర్‌పురా మండల అధ్యక్షురాలు మేరాజ్‌ సుల్తానా, ప్రధాన కార్యదర్శి సహేరా భాను, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



గెలుపొందిన విద్యార్థులతో శివశంకర్‌

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సబ్‌ఇన్‌స్పెక్టర్‌ వి.శివశంకర్‌ అన్నారు. జానకి మోడల్‌ స్కూల్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన జానకి మోడల్‌ స్కూల్‌ చిల్డ్రన్‌ చెస్‌ టోర్నమెంట్‌ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అండర్‌–12 బాలుర విభాగంలో డి.సాయి, అండర్‌–10 విభాగంలో త్రిహాన్స్‌ సాయి, అండర్‌–8 విభాగంలో ప్రసాద్‌ అంబంటి గెలుపొందారు. అదేవిధంగా బాలికలలో అండర్‌–12 విభాగంలో ఆరాధ్య, అండర్‌–10 విభాగంలో సాన్విక గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జోనల్‌ అధికారులు

చార్మినార్‌: ప్రజావాణి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోన్‌ జోనల్‌ అధికారులు తెలిపారు. జోనల్‌ కమిషనర్‌ వెంకన్న పర్యవేక్షణలో జోనల్‌ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమ వారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్‌కి చెందిన డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, సంతోష్‌ నగర్‌ సర్కిల్‌కి చెందిన గౌలిపురా ఆలే నరేంద్ర స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ల సమస్యలపై మొత్తం 4 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్‌ అధికారులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరించామన్నారు. జాయింట్‌ కమిషనర్‌ శైలజ, ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ ప్లానింగ్‌ సిటీ ప్లానర్‌ మహమ్మద్‌ అబ్దుల్‌ మజీద్‌, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్‌ ఈఈ రామారావు, బిల్‌ కలెక్టర్‌ రాజేష్‌ పాల్గొన్నారు.





పాతబస్తీలో మరో ఫ్లై ఓవర్‌ అందుబాటులోకి వచ్చింది. జూ పార్క్‌ నుంచి ఆరాంఘర్‌ వరకు నిర్మించిన ఫ్లై ఓవర్‌ను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌ బాబు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ ఒవైసీ, మేయర్‌ విజయలక్ష్మి తదితరులు ప్రారంభించారు.
– సాక్షి, సిటీబ్యూరో

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జియాగూడ: భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్‌కు పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం సందడిగా జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సోమశేఖర్‌ రెడ్డి, విజయసేనారెడ్డి, శేఖర్‌ రెడ్డి, రామకృష్ణ, బాలాజీ, కిషన్‌, జి.చంద్రశేఖర్‌, దేవేందర్‌, పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, కేశవ్‌, సుష్మ, ప్రసన్న, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, బాబు, రాఘవేందర్‌ పాల్గొన్నారు.

టీఎన్జీఓ కేంద్ర సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న గడ్డం ప్రసాద్‌ కుమార్‌, షబ్బీర్‌ అలీ, ప్రొఫెసర్‌ కోదండరామ్‌, అద్దంకి దయాకర్‌, మారం జగదీష్‌

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని రాష్ట్ర శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌ కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు లలిత కళాతోరణంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం నూతన సంవత్సరం డైరీ, కేలండర్‌ ఆవిష్కరణ సభ జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్‌ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా గడ్డం ప్రసాద్‌ కుమార్‌ హాజరై టీఎన్జీఓ కేంద్ర సంఘం డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. అంతకు ముందు 33 జిల్లాల ఉద్యోగ సంఘ నేతలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్‌ కోదండరామ్‌, ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌ అలీ షబ్బీర్‌, కాంగ్రెస్‌ నేత అద్దంకి దయాకర్‌ ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్రను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు తో పాటుగా 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న పిట్టల చంద్రశేఖర్‌

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్‌ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పిట్టల చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ సెంట్రల్‌ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోవడం లేదని విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. బీసీలంతా తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌ సింగ్‌, నాయకులు ఆవుల నరేష్‌, మధు, నరేష్‌, శ్రీధర్‌ పాల్గొన్నారు.

మెహిదీపట్నం డిపోలో జాతీయ భద్రతా వారోత్సవాలు




మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసరావు

గోల్కొండ: ఆర్టీసీ వాహనాలు నడిపే డ్రైవర్లు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల క్షేమంతో పాటు రోడ్లపై నడిచే వారి జీవితాల గురించి కూడా ఆలోచించాలని పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం ఎంవీఐ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో జాతీయ భద్రత వారోత్సవాలు జరిగాయి. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆర్టీసీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. బస్సు డ్రైవర్లు ప్రశాంత మనస్సుతో వాహనాలు నడపాలని దీన్ని వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నాయన్నారు. తమ సర్వీసును ప్రమాదరహితంగా పూర్తి చేసిన వారు తాము పని చేసే సంస్థ నుంచి అవార్డులు, రివార్డులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌ బి.వి.కె.మూర్తి, అసిస్టెంట్‌ మేనేజర్‌ సరస్వతీ, అసిస్టెంట్‌ మెకానికల్‌ ఇంజినీర్‌ రహమాన్‌, ఏఎంవీఐ అఖిలతో పాటు డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేలండర్‌ ఆవిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ బాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన మంత్రి శ్రీధర్‌బాబును స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనా రెడ్డి మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలకు, క్రీడల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేయాలని మంత్రిని శివసేనా రెడ్డి కోరారు. స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ తెలంగాణ కోచెస్‌ నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం శివసేనా రెడ్డి, ఎండీ సోని బాలదేవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ కార్యవర్గ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, జితేందర్‌ గుప్తా, రమేష్‌ గౌడ్‌, ఫణీంద్ర, సాయికుమార్‌, చైతన్య, జైపాల్‌ నాయక్‌ పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శివసేనా రెడ్డి తదితరులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: స్వీయ రక్షణ కోసం విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని నాయక్‌ బూడోఖాన్‌ కరాటే మాస్టర్‌ పి.గణేష్‌ నాయక్‌ అన్నారు. సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో జరిగిన హైదరాబాద్‌ ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌–2025 పోటీల్లో జహనుమాలోని మాన్‌ఫోర్ట్‌ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు కుంతి, కటా విభాగాలలో సత్తాచాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్‌ రెవరెండ్‌ బ్రదర్‌ ఎడ్వర్డ్‌రాజ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డేవిడ్‌ కుజూర్‌, కోఆర్డినేటర్‌ ఫరీజా, కరాటే కోచ్‌ అజయ్‌ కుమార్‌, స్నేహ తదితరులు అభినందనలు తెలియజేశారు.